నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

శనివారం | ఏప్రిల్ 13, 2024 | www.navatelangana.com

ముత్యాలమ్మకు బోనాలు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని గండివేట్ గ్రామంలో ముత్యాలమ్మకు బోనాల పండుగ ను అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఊరు ఊరంతా అమ్మవారికి బోనాలను సమర్పించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బోనాలతో ఊరేగించారు. అమ్మవారి నామస్మరణతో పుర వీధులు మార్మోగాయి. డీజే పాటలతో హెూరెత్తింది. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని కుల సంఘాల పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు గ్రామస్తులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

సీపీఐ(ఎం) నగర కమిటీ సభ్యుడు మున్నాభాయ్ మృతి

- సంతాపం తెలిపిన నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సీపీఐ(ఎం) నిజామాబాద్ నగర కమిటీ సభ్యుడు, బహుజన కాలనీ భూ పోరాట నాయకుడు, మైనార్టీ ఉద్యమ నాయకుడు మున్నాభాయ్ శుక్రవారం అనారోగ్యానికి గురై తుది శ్వాస విడిచారు. ఆయన మరణం సీపీఐ(ఎం) ఉద్యమానికి, కాలనీ అభివృద్ధికి తీవ్ర నష్టం చేస్తుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు ప్రకటించారు. పార్టీ జిల్లా కమిటీ తరఫున ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పేద ప్రజల తరఫున బహుజన కాలనీలో ఇళ్ల స్థలాల పోరాటం నిర్వహణలో ముఖ్య భూమిక పోషించారని, అనేక ప్రజా సమస్యలపై ఉద్యమంలో పాల్గొన్నారని ఆయన తెలిపారు. మున్నాభాయ్ అంత్యక్రియలలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నగర కార్యదర్శి పి.సూరి, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, విఘ్నేష్, నగర కమిటీ సభ్యులు కటారి రాములు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేనా?

- నకిలీ విత్తనాలతో మోసపోయిన అన్నదాతలు
- సదరు కంపెనీపై చర్యలు తీసుకొని పరిహారం చెల్లించాలని గతంలో ఆందోళన
- హామీ ఇచ్చి మరిచిన అధికారులు

నవతెలంగాణ-కోటగిరి

నకిలీ వితనాలు అంటగట్టి గ్రోమోర్ తమను నిలువునా ముంచిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అయినా అధికారులు సైతం చర్యలు తీసుకోవడం లేదని, తమకు నష్టపరిహారం చెల్లించడం లేదని వాపోతున్నారు. పరిహారం కోసం గ్రోమోర్ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతులందరూ గ్రోమోర్ సంస్థల చుట్టూ, అధికారుల చుట్టూ, నాయకుల చుట్టూ ప్రదర్శనలు చేస్తూ ఉన్నప్పటికీ రైతులకు నష్టపరిహారం అందని ద్రాక్షగా మిగిలిపోతుంది. గతంలో బాన్సువాడ ఏడిఏ వీరస్వామి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు కోటగిరి మండల కేంద్రంలోని గ్రోమోర్ దుకాణం పరిశీలించి, ఆర్కే సోనా వరి రకపు విత్తనాలు ఎన్ని బస్తాలు రైతులకు అందించాలని తెలుసుకున్నారు. అయినా ఇప్పటికీ పరిహారంపై రైతులకు ఎలాంటి సమాచారం రావడం లేదని వాపోతున్నారు.



నారుతో గ్రోమోర్‌కు వచ్చి నిరసన వ్యక్తం చేస్తూ అధికారులతో మాట్లాడుతున్న రైతులు(ఫైల్)

కోటగిరిలో గ్రోమోర్‌లో వరి విత్తనాలు కొనుగోలు చేసిన పలువురి రైతుల పంటలు ఎండు తెగులుతోపాటు, పంట పొలాలు పాలు పోసుకోకపోవడంతో పాటు కోతకు రాకపోవడంతో నకిలీ విత్తనాల వల్ల మోసపోయినట్టు రైతులు గ్రహించి గ్రోమోర్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. 58 మంది రైతులకు 150 బస్తాలు ఇచ్చినట్లు గ్రోమోర్ దుకాణపు ఇంచార్జ్ కాశి విశ్వనాథ్ తెలిపారు. ఇచ్చినటువంటి వరి వంగడం స్వల్ప, మధ్య, దీర్ఘకాలమా, ఎన్ని రోజులను పంట చేతికి వస్తుందని ఏడిఏ వీరస్వామి అడిగిన ప్రశ్నకు గ్రోమోర్ ప్రతినిధులు నీళ్లు నమిలారు. వెంటనే వరి విత్తనాలపై ఆర్కే సోనా ప్రతినిధులు, అన్ని పత్రాలతో రావాలని లేనియెడల చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చరవాణిలో వరి విత్తనాలు పంపిణీ చేసిన ప్రతినిధులు ఆదేశించారు. కోటగిరిలో మిగిలిన 50 బస్తాలు ఎవరెవరికి ఇచ్చారని, వెంటనే ఆ రైతుల సమాచారం సేకరించమని మండల వ్యవసాయ ప్రతినిధులకు ఏడిఏ ఆదేశించారు. సీడ్ కంపెనీ వాళ్లకు పూర్తి సమాచారంతో రావాల్సిందిగా సీడ్ కంపెనీ వాళ్లను ఆదేశించారు. సీడ్ కంపెనీ వారు వచ్చిన వెంటనే నిజ నిర్ధారణ చేసి, బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులకు తగు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

అనంతరం సంబంధిత రైతుల పంట పొలాలను సందర్శించి, రైతులకు పంటకు తగు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా తెలియజేసి, భరోసా కల్పించారు. ఆర్కే సోనా కంపెనీ అధికారులు వచ్చి వెళ్లారు, కాని ఎటువంటి రైతులకు హామీ ఇవ్వకుండా వెళ్లిపోయారు. ఆదుకుంటామని అధికారులు భరోసా కల్పించినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని రైతులు వాపోతున్నారు.

చర్యలకు వెనుకడుగు..

నాసి రకమైన విత్తనాలు రైతులకు అంటగట్టి మోసం చేసిన గ్రోమోరు సంస్థ పై ఎటువంటి చర్యలు తీసుకొని, రైతులకు న్యాయం చేయాలని రైతుల మొరపెట్టుకుంటున్నారు. బీర్కూరు, కోటగిరి మండలాల్లో ఆర్కే సోనా పంటలకు ఎండు తెగులుతోపాటు, పంట పొలాలు పాలు పోసుకోకపోవడం, అన్ని పంటలు కోతకు రావడం, ఆర్కే సోనారకం చేతికి రాకపోవడం గమనార్హం. ఒకపక్క ప్రకృతి వైపరీత్యాలు, మరోపక్క నీటి ఎద్దడి రైతులకు అగమ్య గోచరంగా మారింది. రైతుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై తగు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని రైతులు ఇటీవల కాంగ్రెస్ నాయకులు అన్వేష్ రెడ్డిని కలిసి మొరపెట్టుకున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

మందుబాబులపై కొరడా..

- డ్రంకెన్ డ్రైవ్‌లో ఏకంగా 19 మందికి రెండు రోజుల జైలు శిక్ష, 236 మందికి జరిమానా

నవతెలంగాణ-ఆర్మూర్/ఏర్గట్ల/బాల్కొండ/కమ్మర్‌పల్లి/మెండోరా

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. ఒక్కరు కాదు ఇద్దరు కాదు.. ఏకంగా 256 మందిని ఆర్మూర్ కోర్టులో హాజరు పరచగా.. 19 మందికి రెండు రోజుల జైలు శిక్ష, 237 మందికి జరిమానా విధిస్తూ ఆర్మూర్ కోర్టు తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఆర్మూర్ డివిజన్‌లోని పది పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మద్యం సేవించిన వాహనాలు నడిపిన 256 ముద్దాయిలను సీపీ కల్మేశ్వర్ ఆదేశానుసారం శుక్రవారం ఆర్మూర్ కోర్టులో ప్రవేశపెట్టినట్టు ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. స్పెషల్ డ్రైవ్ క్రింద గౌరవ ఆర్మూర్ కోర్ట్ నందు హాజరు పరచగా, వారిలో 19 మంది ముద్దాయిలకు రెండు రోజుల జైలు శిక్ష విధించగా, 237 ముద్దాయిలకు మొత్తం రూ. 4,43,000 జరిమానా విధించారు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్ నుండి 38 కేసులకు గాను నలుగురికి జైలు శిక్ష, 67,500/- రూపాయలు జరిమానా విధించినట్టు తెలిపారు. అదే విధంగా బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిదిలో 21 కేసులకు 41,500/- రూపాయలు జరిమానా, నందిపేట్ పోలీస్ స్టేషన్ నుండి 21 కేసులకు గాను 30,500/- రూపాయలు జరిమానా, వేల్పూర్ పోలీస్ స్టేషన్ పరిడిలో 18 కేసులకు గాను 38,000/- రూపాయలు జరిమానా, మెండోరా పోలీస్ స్టేషన్ నుండి 29 కేసులకు గాను అయిదుగురికి జైలు శిక్ష మరియు 68,000/- రూపాయలు జరిమానా విధించారు. ముప్కాల్ పోలీస్ స్టేషన్ నుండి 12 కేసులకు గాను ఒక్కరికీ జైలు శిక్ష మరియు 23500/- రూపాయలు జరిమానా, భీంగల్ పోలీస్ స్టేషన్ నుండి 29 కేసులకు గాను ముగ్గురికి జైలు శిక్ష మరియు 44,000/- రూపాయలు జరిమానా, కమ్మర్ పల్లి పోలీస్ స్టేషన్ నుండి 32 కేసులకు గాను నలుగురికి జైలు శిక్ష మరియు 45,500/- రూపాయలు జరిమానా, ఎర్గట్ల పోలీస్ స్టేషన్ నుండి 31 కేసులకు గాను ఇద్దరికీ జైలు శిక్ష మరియు 55,000/- రూపాయలు జరిమానా మరియు మోర్తాడ్ పోలీస్ స్టేషన్ నుండి 25 కేసులకు గాను 29,500/- రూపాయలు జరిమానా విధించినట్టు తెలిపారు. ఇక ముందు మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపైన చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. కావున ప్రజలు మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు.

ప్రేమ పేరుతో ఎంపీవో మోసం

- కేసు పెట్టిన మహిళా ఉద్యోగి

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధికారిగా (ఎంపీఓ) విధులు నిర్వహిస్తున్న సుభాశ్‌చంద్రబోస్ ప్రేమ పేరుతో మోసం చేసినట్టు మహిళా ఉద్యోగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అప్పటికే ఆయన పెళ్లి చేసుకున్నట్లు సమాచారం. అయినప్పటికీ ఎడపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూనే ఒక యువతని పెళ్లి చేసుకుంటానని నమ్మించారు. ఆ యువతి కూడా అదే శాఖలో మహిళా ఉద్యోగి. పెళ్లి ఎప్పుడు చేసుకుంటావని సుభాష్ చంద్రబోస్‌ను ఆమె గట్టిగా నిలదీయడంతో ఇవాళ రేపు అంటూ మాయమాటలు చెప్పి తప్పించుకున్నట్టు సమాచారం. చివరికి విసిగిపోయిన మహిళ ఉద్యోగిని నిజామాబాద్ పట్టణంలోని మూడవ టౌన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. కాగా పోలీసులు సదరు ఎంపీవోను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ప్రేమ పేరుతో వంచించిన ఎంపీవోపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



మహత్మ బసవేశ్వరుడు మహనీయుడు

- మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నవతెలంగాణ-జుక్కల్

మహత్మ బసవేశ్వరుడు మహనీయుడని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. మండలంలోని లొంగన్ గ్రామంలో వీరశైవ లింగాయత్‌లు, గ్రామస్తులు కలిసి ఏర్పాటు చేసిన ఆరాధ్య గురువు బసవేశ్వరుని విగ్రహ ఆవిష్కరణ శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొని ప్రసంగించారు. బసవేశ్వరుని ప్రవచనాలు అన్నిమతాల సమానత్వం, ఒకరికి ఒకరు సంస్కృతికంగా కలిసి మెలిసి ఉంటు ఎవరికి తోచిన వారు తన ఇష్ట దేవతలను పూజించుకోవడం గౌరవంగా ఉండే విధంగా సమాజాన్ని సన్మార్గంలో పెట్టెందుకు బోధనలు చేశారని గుర్తు చేశారు. అన్ని మతాలను సమానంగా గౌరవించేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లొంగన్ గ్రామ వీరశైవ లింగాయత్ సంఘం సభ్యులు , గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షిండే

బోరు మోటార్ ప్రారంభం

నవతెలంగాణ-జుక్కల్

సోలేనిస్ గ్యాస్ ఇండియా ప్రయివేట్ లిమిటేడ్ కంపెనీ, మరియూ సీఎస్ఆర్ నిధుల నుండి మార్పు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మైబాపూర్ గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు సంస్థ ప్రతినిధులు శుక్రవారం నాడు స్థానిక నేతలతో కలిసి బోరువేసి మోటారు బిగించి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు గీతాసింగ్, అరుణ్ మాట్లాడుతు మారుమూల గ్రామాలలో సేవలందించేకు తమవంతు సహకార అందిస్తున్నట్టు తెలిపారు. జుక్కల్ మారుముల ప్రాంతం కావడంతో మైబాపూర్ గ్రామం ప్రజలు తీవ్ర నీటి సమస్య ఉన్నప్పుడు ప్రభుత్వం బాద్యతగా సమస్య పరిష్కరించినప్పటికీ, తమ వంతుగా ఉడుతా భక్తీగా ఇంకా అవసరం ఉందని భావించినట్టు తెలిపారు. మున్ముందు సైతం తమవంతు సహకారం చేస్తామని తెలిపారు.

ఆలయం అభివృద్ధికి విరాళం

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని స్థానిక నల్ల పోచమ్మ ఆలయం అభివృద్ధి కోసం మాజీ వార్డు సభ్యులు బొమ్మెర శ్రీనివాస్ - గాయత్రి దంపతులు వారి కుమారుడు రోహిత్ కుమార్ చేతుల మీదుగా 21,101 రూపాయలు ఆలయ కోశాధికారి కదిరె మోహన్‌రెడ్డి విరాళంగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకొండ గ్రామం లోని నల్ల పోచమ్మ ఆలయం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొమ్మెర గంగాధర్-సుజాత, మణెమ్మ, రేవంత్ కుమార్, సాహితి, శ్రావణి, శివాత్మిక తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేత

మంజీరా నది ఒడ్డున నీటి కటకట

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో ఎన్నడు లేని విధంగా మొట్టమొదటిసారిగా తాగు నీరు అందని దుస్థితి నెలకొంది. పోతంగల్‌లోనే కాకుండా, ఉత్తమ పిహెచ్‌సి సెంటర్‌లో రోగులకు నీరు దొరకని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని, మంచి నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బయటి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న రోగులు

ధాన్యం సేకరణ సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం సేకరణ ప్రక్రియను ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సజావుగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరుతెన్నులపై శుక్రవారం రాత్రి సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ, ధాన్యం సేకరణ తీరును పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం సేకరించారు, గతేడాది ఇదే సమయానికి ఎంత మేరకు సేకరణ జరిగింది తదితర అంశాలను పరిశీలించాలన్నారు. ఎక్కడైనా సమస్యలు గుర్తిస్తే వెంటనే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఎక్కడ కూడా ఏ ఒక్క కేంద్రంలోనూ ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందులు ఏర్పడకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు అసౌకర్యం కలుగకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు (ప్యాడి క్లీనర్లు), గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు సరిపడా అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతులకు త్వరితగతిన బిల్లులు చెల్లించేలా చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం సేకరణలో ఇబ్బందులు నెలకొన్నాయనే ఫిర్యాదులకు ఆస్కారం ఉండకుండా చిత్తశుద్ధితో పని చేయాలని, ఏ ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సెల్ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూగజీవాలకు నీరు

- నవతెలంగాణ కథనంతో స్పందించిన ఫారెస్ట్ అధికారులు
- అటవీ ప్రాంతంలో సాసర్ ఫీట్లల్లో ట్యాంకర్‌లతో నీరు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి



సాసర్‌ఫీట్లల్లో నీళ్లు

అడవి జంతువులకు వేసవి కాలంలో దప్పికతో అలుమటిస్తున్నాయని, మూగజీవులకు అడవిలో నీరు లభించకపోవడంతో మత్యువాత పడుతున్నాయని నవతెలంగాణలో 'నీళ్లకు నిధులు లేవు' శీర్షికతో బుధవారం ప్రచురితమైన కథనానికి ఫారెస్ట్ అధికారులు స్పందించారు. రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట్ సెక్షన్ పరిధిలోని మద్దికుంట, ఇస్సన్నపల్లి, రెడ్డిపేట్ తదితర గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం ఫారెస్ట్ అధికారులు జంతువులకు నీరు అందించటానికి ఏర్పాటు చేసిన సాసర్ ఫీట్లల్లో ట్యాంకర్లతో నీటిని నింపారు. నిధులు మంజూరు కాకపోయిన క్షేత్రస్థాయి అధికారులు సొంత డబ్బులతో వెచ్చించి మూగజీవులకు నీరు అందిస్తున్నారు. ప్రత్యేక అధికారి భీమ్ రెడ్డి శుక్రవారం రెడ్డి పేట సెక్షన్ పరిధిలోని సాసర్ ఫీట్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో శిక్షణ అధికారి శంకర్, బీట్ అధికారులు శేఖర్ రెడ్డి, రామ లీల, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ట్యాంకర్‌తో నీళ్లు నింపుతున్న అధికారులు

పోరాటాలకు సిద్ధం కావాలి

- విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబిస్తోన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధిచెప్పాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రజనీకాంత్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక కర్షక బీఈడీ కళాశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ రజనీకాంత్ హాజరై మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని వారిపై విద్యార్థులోకం పోరాటాలకు సిద్ధమవ్వాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేటు కార్పోరేట్‌కు అప్పజెప్పాలని ప్రయత్నం చేస్తుందని, ఇది పేద విద్యార్థులకు వ్యతిరేకమైన విద్యా విధానమని వెంటనే దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం సుమారు 7 వేల కోట్లకు పైగా స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్లో ఉన్నా గాని విడుదల చేయకపోవడం సరైనది కాదన్నారు. విద్యార్థులకి ఫీజు రీయి ంబర్స్‌మెంట్ రాకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరుణ్, అజయ్ నాయకులు మణికంఠ, సాయి, సాగర్, నితిన్, సచిన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రజనీకాంత్

హోటల్‌లోకి దూసుకెళ్ళిన కారు

- ఒకరికి గాయాలు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండల కేంద్రంలో శుక్రవారం ఓ కారు బీభత్సం సృష్టించింది. అదుపు తప్పి ఏర్గట్ల బస్టాండ్ వద్ద గల ఓ హోటల్‌లోకి దూసుకెళ్లింది. దీంతో హెూటల్ నిర్వాహకుడు ఎనుగందుల రవికి గాయాలు కావడంతో అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటన స్థలాన్ని పరిశీలించారు.



హోటల్‌లోకి దూసుకొచ్చిన కారు

జహీరాబాద్ సీటు కైవసం చేసుకోవాలి

- ఎమ్మెల్యేలతో, నాయకులతో సీఎం రివ్యూ

నవతెలంగాణ-మద్నూర్

జహీరాబాద్ లోక్‌సభ సీటును ఎట్టిపరిస్థితుల్లో కైవసం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జహీరాబాద్ పరిధి ఎమ్మెల్యేలతో, నాయకులతో శుక్రవారం రివ్యూ నిర్వహించారు. రివ్యూలో భాగంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు పాల్గొన్నారు. జుక్కల్ ఎమ్మెల్యేతో పాటు జహీరాబాద్ పార్లమెంటు పరిధిలోని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి, బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ఏనుగు రవీందర్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.



సీఎంతో ఎమ్మెల్యేలు, నాయకులు

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

- జయప్రదం చేయండి : ఎంపీపీ

నవతెలంగాణ-రామారెడ్డి

జిల్లా కేంద్రంలో నేడు (శనివారం) బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కామారెడ్డి నియోజకవర్గ రామారెడ్డి, కామారెడ్డి మండలాల గ్రామాల్లోని కార్యకర్తల సర్వసభ్య సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు ముజిబుద్దీన్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, యూత్ అధ్యక్షులు గడ్డం రవీందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, మాజీ విప్ గంప గోవర్ధన్ హాజరై దిశా నిర్దేశం చేయనున్నట్టు తెలిపారు. కావున బి ఆర్ ఎస్ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రానికి చెందిన న్యావనంది కళావతి అనే వృద్ధురాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో సమాచారం తెలుసుకున్న ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వన్నెల దేవి లావణ్య శ్రీనివాసులు శుక్రవారం ఎడపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంతాపం వ్యక్తం చేశారు. వారి వెంట అవ్వనంది శ్రీధర్, బొబ్బిలి శ్రీనివాస్ తదితరులున్నారు.


బాధిత కుటుంబానికి పరామర్శ

వృథాగా నీటి తొట్టి

నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఖండ్‌గాం గ్రామంలో పశువుల సౌకర్యార్థం గతంలో తాగునీటి తొట్టిని నిర్మించారు. కొన్ని రోజులు దానిని గ్రామపంచాయతీ వారు తాగునీటితో నింపినా.. తీరా పట్టించుకోకుండా వదిలేశారు. ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉండడంతో పశువులు తాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తింది. నీటి తొట్టి సిద్ధంగా ఉన్నా అందులో తాగునీటిని నింపకపోవడంతో వృథాగా మారింది. ఎండలు మండుతున్న సందర్భంగా పశువులకు కనీసం తాగునీటిని అందించడానికి నీటితొట్టిలో నీరు నింపి ఉంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.


వృథాగా మారిన నీటితొట్టి

ఆరునెల్లకోసారి బిగ్ జాబ్‌మేళా

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా
- ధన్‌పాల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.. గ్రంథాలయంలో ఉచిత భోజనం ఏర్పాటు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని ఖలీల్‌వాడిలో గల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ధన్‌పాల్ లక్ష్మీభాయ్, విఠల్ గుప్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఉచిత భోజన సౌకర్యాన్ని శుక్రవారం ప్రారంభించారు. దాదాపు రెండువందల మందికి ఉచిత మధ్యాహ్న భోజనం సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే నీళ్ల, నిధులు, నియామకాల కోసమని.. కానీ గత ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చేయి చూయించిందన్నారు. నిరుద్యోగులు ఉరేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రస్తుతమున్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఎన్నికల కోడ్ అనంతరం రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్టుగా ఉద్యోగ అవకాశాలు సకాలంలో కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి రూ.4000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరుద్యోగుల తరుపున ఉద్యమం చేపడతానని హెచ్చరించారు. లైబ్రరీకీ వచ్చే అభ్యర్థులకు తన ట్రస్ట్ ద్వారా సేవలందించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుద్యోగతను తగ్గించడం కోసం తన వంతుగా ఆరు నెలలకు ఒకసారి బిగ్ జాబ్ మేళా నిర్వహిస్తామని అన్నారు. వేసవి కాలంలో ఎండలు మండిపోతుండటంతో గ్రంథాలయంలో కూలర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు అభ్యర్థులు విన్నవించగా.. వెంటనే ధన్‌పాల్ స్పందిస్తూ గ్రంథాలయ అధికారికి మాట్లాడి కూలర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ ఇల్లేందుల మమత ప్రభాకర్, మఠం పవన్, ఆనంద్, పవన్ ముందడ తదితరులు పాల్గొన్నారు.


భోజనాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే

మతోన్మాద ఫాసిస్ట్ బీజేపీని ఓడించండి

- మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్


జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

జ్యోతిబాపూలే స్ఫూర్తితో మతోన్మాద ఫాసిస్ట్ బీజేపీని ఓడించాలని సిపిఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వి ప్రభాకర్ అన్నారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ సంయుక్త మండలాల ఆధ్వర్యంలో పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో శుక్రవారం జ్యోతిబాపూలే 197వ జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.దేవరాం మాట్లాడుతూ.. 18వ సంవత్సర కాలంలోనే జ్యోతిరావు పూలే ఎన్నో అవమానాలను ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కోన్నారని అన్నారు. బాల్యం నుంచే ప్రాథమిక విద్యను అభ్యసించి తను 13 ఏళ్ల సంవత్సరంలోనే వివాహమాడి అనేక మంది మహిళలకు పురుషులకు చదువు చెప్పారని వివరించారు. ఈ దేశంలో లింగ వర్గ భేదాలు తారతమ్యం లేకుండా జీవించాలని కలలుగన్నారని తెలిపారు. జ్యోతిరావుపూలే 197వ జయంతి సందర్భంగా మనమందరం కులాలకు మతాలకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని ఈ సమాజంలో దోపిడీ వ్యవస్థకు తావివ్వకుండా పోరాటదారుల్లో ముందుకు నడవాలని వారు అన్నారు. అదేవిధంగా నేడు భారతదేశంలో 10 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న మతోన్మాద ఫాసిస్టు బిజెపిని ఈ వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో ఓడించాలని, అప్పుడే నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిపిఐఎంఎల్ మాస్ లైన్ సంయుక్త మండలాల కార్యదర్శి బి.కిషన్, నాయకులు శేఖర్, ఠాకూర్, రాజన్న, రమేష్, నరేందర్, లక్ష్మి, పద్మ, అనిల్, రోజా, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఒత్తిడి నుంచి ఉపశమనం అనే అంశంపై శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనవుతున్నారని, ఆ ఒత్తిడిని ఎలా అధిగమించాలనేది తెలియజేశారు. ఒత్తిడికి గురైన వారు వ్యాయామం, ధ్యానం చేయాలని, పోషక విలువలు గల ఆహారం తీసుకోవడం, నీరుతాగడం లాంటి వాటి ద్వారా ఒత్తిడి నుంచి విముక్తి పొందవచ్చునని డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ జి.స్వామి సులోచన తెలిపారు. కార్యక్రమంలో మానసిక వైద్యుడు రవితేజ, అనురాధ, కళాశాల ప్రిన్సిపాల్ ధనవేణి, హెచ్.ఎస్.సంతోషి అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘ భవనం ప్రారంభోత్సవం


భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో శుక్రవారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సంఘ నాయకులు నూతనంగా నిర్మించిన సంఘ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీవాసులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే షకిల్ ఆమెర్ సంఘం భవన నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు అందించారని, అలాగే సంఘ సభ్యులు విరాళాలు సేకరించి భవన నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. అలాగే ప్రస్తుత బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరు సుదర్శన్ రెడ్డి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగా శంకర్, సంఘం అధ్యక్షులు ఏశాల రవి, కార్యదర్శి ఏషాల చిన్న పోశెట్టి, కోశాధికారి ఎర్రం పెద్ద లక్ష్మణ్, సిపిఐ(ఎం) బోధన్ అసెంబ్లీ నియోజకవర్గం కార్యదర్శి ఏశాల గంగాధర్, సాయిలు, రుద్రూర్ మున్నూరు కాపు సంఘం నాయకులు బండారి ముత్తయ్య, కమల గంగాధర్, కమ్మ సంఘం నాయకులు మండవ శ్రీనివాస్, కమ్మరాజు, గాదే ప్రవీణ్, ఏషాల చంద్రశేఖర్, యేశాల రాజు, ఏశాల రత్నాకర్, సునీల్, దేకం సాయిలు, ద్యాకం గంగాధర్, లోలపు ఒడ్డెన్న, తోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- ఐఎఫ్‌టీయూ బోధన్ డివిజన్ నాయకులు కాశ రవి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పలు గ్రామాలలో అకాల వర్షం, వడగాళ్ల వర్షానికి రైతులు పండించిన వరి పంటలు నేలకొరిగాయని, రైతులు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని ఐఎఫ్‌టీయూ బోధన్ డివిజన్ నాయకులు కాషా రవి అన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు కొత్త రుణాలు, పెట్టుబడి సాయం చేయాలని కోరారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని, కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలన్నారు. వరి పంటకు రూ.500 బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

యశోదలో ఐవీయుఎస్ చికిత్స

- అందుబాటులో ఉంది.. సద్వినియోగం చేసుకోండి
- డాక్టర్ గోపి కృష్ణ వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఓపెన్ హార్ట్ అవసరం లేకుండా ఐవిఎల్ కొత్త పద్ధతి ద్వారా ఐవియుఎస్ సహకారంతో నిజామాబాద్‌కు చెందిన పేషెంట్‌కు అరుదైన చికిత్స అందించామని యశోద హాస్పిటల్ డాక్టర్ గోపి కృష్ణ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. తాను నిజామాబాద్‌లో గుండె వైద్య నిపుణులుగా ఎన్నో సేవలు అందించామని ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం, దమ్మన్నపేట్, అమీర్‌నగర్ గ్రామానికి చెందిన గుగులావత్ నందు వయస్సు (49) అనే పేషెంట్ కు గత 10 సంవత్సరాల క్రిందట గుండెలో కవా టాలు మూసు కుపోగా హైద రాబాద్‌లో బైపాస్ ఆపరేషన్ చేసి మైట్రల్ వాల్‌ను అమర్చారని, ఆ పేషెంట్‌కు చాతి నొప్పి, ఆయసం, గుండెదడ మళ్ళీ కలగడంతో తిరిగి వైద్యు లను సంప్రది ంచగా గుండెలో ఇంతకు ముందు అమర్చిన గ్రాఫ్ట్‌లు మూసుకుపోవడం, ప్రధాన గుండె రక్తనాళం కూడ మూసుకుపోయినట్లు గుర్తించారని చాలా మంది డాక్టర్లను సంప్రదించినా మళ్ళీ ఓపెన్ హార్ట్ ఆపరేషన్ అవసరం అని చెప్పగా నందు పేషెంట్ హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్‌ను సంప్రదించాడని, దీంతో తాను ఓపెన్ హార్ట్ ఆపరేషన్ అవసరం లేకుండా ఎల్ఎంసిఏ స్టంట్‌ను ఐవిఎల్, ఐవియుఎస్ సహకారంతో అమర్చామని అన్నారు. ఈ సమావేశంలో సిబ్బంది రాజిరెడ్డి, మధు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ గోపి కృష్ణ

దారి పొడుగునా ధాన్యం రాశులు


రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

నవతెలంగాణ-బోధన్

రైతులు పంటకోసి విక్రయించే ముందు వాటిని ఆరబెట్టడానికి ఇబ్బందులు పడుతున్నారు. దాంతో స్థలం లేక గ్రామీణ ప్రాంత రైతులు బీటీ రోడ్లపై ఆరబెడుతున్నారు. గత రెండు రోజుల నుంచి చిరుజల్లులు కురవడంతో ధాన్యం తడిసిపోకుండా అక్కడే ఆరబెడుతున్నారు. ప్రభుత్వం నాణ్యమైన ధాన్యానికి మద్దతు ధర ఇస్తామని ప్రకటించడంతో రైతులు ధాన్యాన్ని ఆరబెడుతూ మద్దతు ధరకోసం తంటాలు పడుతున్నారు. రహదారులపై ధాన్యం ఆరబెట్టడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దని అధికారులు హెచ్చరిస్తున్నా వారికి స్థలం లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో రోడ్లపై ఆరబెడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పంటలు ఆరబెట్టుకోవడానికి ప్రభుత్వం కల్లాలను మంజూరు చేసింది. ఆర్థిక భారంతో చాలామంది రైతులు వాటిని నిర్మించలేదు. దాంతో స్థలం లేక ప్రస్తుతం రోడ్లను ఆశ్రయించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

మున్సిపల్ కార్యాలయంలో ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం కమిషనర్ రాజు ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా స్వీప్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఓటు హక్కు ఉన్నవారు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచిస్తూ ముగ్గులు వేశారు. ఓటింగ్ శాతం పెంచడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిఈ భూమేశ్వర్, మెప్మా టిఎంసి ఉదయశ్రీ, సీవో రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో ఏకరూప దుస్తులు పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. నగరంలోని మారుతినగర్‌లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగుల పాఠశాలలో ఉబంటు ట్రస్ట్ ఆఫ్ ఇండియా ద్వారా స్నేహ సొసైటీ వసతి గృహంలో చదువుకునే అందులకు, మానసిక దివ్యాంగులకు ఏకరూప దుస్తులు, సివిల్ దుస్తులను పంపిణీ చేశారు. ఉబంటు ట్రస్టు కోశాధికారి దేవాగాం రామాచారి ఆధ్వర్యంలో ఈ దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్రాంత ఐఏఎస్ అధికారి తోగర్ల చిరంజీవులు ఆధ్వర్యంలో ఉబంటు ట్రస్టు ఏర్పాటు చేసి భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో పని చేస్తుందని, ప్రధానంగా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు వరద బాధితులకు బట్టలు, నిత్యవసరాల పంపిణీ, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే నిరుపేద విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ, స్నేహ సొసైటీలో చదువుకునే నిరుపేద దివ్యాంగులకు ఏకరూప దుస్తుల పంపిణీ, సివిల్ దుస్తుల పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ ప్రధాన కార్యదర్శి యస్.సిద్దయ్య, ప్రిన్సిపాల్ యస్.జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, మానసిక పాఠశాల సిబ్బంది, అందుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కళలకు ప్రాణం పోసిన కానూరు జీవితం ఆదర్శం


కానూరు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

ప్రజా కళలకు ప్రాణం పోసిన కానూరు వెంకటేశ్వరరావు జీవితం కళాకారులకు ఆదర్శప్రాయమని అరుణోదయ జిల్లా కమిటీ సభ్యులు దాల్మల్క పోశెట్టి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలో అరుణోదయ ఆధ్వర్యంలో కానూరి స్మారక దినాన్ని పునస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక మార్పులో కళాకారుల పాత్ర కీలకమని ఆయన అన్నారు. జీవితాంతం ప్రజా కళాకారుడిగా ఉండడం కత్తి మీద సాము లాంటిదని ఆయన తెలిపారు. అరుణోదయ వ్యవస్థాపకులు కానూరి స్ఫూర్తిని ఎదనిండా నింపుకొని ఈ దేశంలో శ్రమ దోపిడిలేని రాజ్యంకై ఉద్యమిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అశోక్, సాయిలు, శ్రీనివాస్, లక్ష్మణ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

నవతెలంగాణ-ఆర్మూర్


పుస్తకాలు వితరణ చేస్తున్న దృశ్యం

రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ అధ్యక్షతన పట్టణంలోని గ్రంథాలయానికి శుక్రవారం పోటీ పరీక్షల నిమిత్తం డీఎస్సీ, టెట్, గ్రూప్స్, ఐసెట్, వివిధ పోటీ పరీక్షలకు అవసరమగు పుస్తకాలను ఉచితంగా వితరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ మాట్లాడుతూ.. ఆర్మూర్ వాసి తమ సోదరీమణి అమెరికాలో స్థిరపడిన డాక్టర్ ప్రమీల మా రోటరీ సేవలను చూసి తమ వంతు ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. ఈ సహాయాన్ని గ్రంథాలయంలోని పాఠకులకు పోటీ పరీక్షల నిమిత్తం రూ.7000 విలువగల పుస్తకాలను అందజేసినట్టు తెలిపారు. వీటిని చదివి మీరు అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని ఉన్నత ఉద్యోగాన్ని సాధించి దేశానికి సేవ చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్యదర్శి పట్వారి తులసి మాట్లాడుతూ గ్రంథాలయానికి తమ వంతు సేవలు ఎల్లప్పుడూ చేస్తూ ఉంటామని, గ్రంథాలయం అభివృద్ధి పట్టణ, జిల్లా అధికారులు శ్రద్ధ చూపి వారికి అవసరమయ్యే వసతులను పూర్తిగా సమకూర్చి పాఠకులకు ఉన్నత స్థానంలో నిలిచే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి లక్ష్మీనారాయణ, రోటరీ మాజీ అసిస్టెంట్ గవర్నర్ పద్మ, మురళి, విజయసారధి, మాజీ అధ్యక్షులు ప్రవీణ్ పవార్, రోటరీ సభ్యులు మానస గణేష్, చౌటి లింబాద్రి, వినాయక్, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో పలువురిపై తేనెటీగల దాడి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గురువారం సాయంత్రం పలువురిపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి.. రంజాన్ పండగ సందర్భంగా పాఠశాల ఆవరణ గేట్లు రెండు దిక్కుల మూసి వేశారు. మరొక సైడు ఉన్న ప్రహరీ పాక్షికంగా దెబ్బతినడంతో పలువురు చిన్న పిల్లలు చెట్టుపైకి రాళ్లతో విసరగా.. తేనెటీగలు లేచాయి. దీంతో చుట్టుపక్కల గల ఇండ్లలోకి ఒక్కసారిగా చొరబడి మీదకు దూసుకు రావడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.. దీంతో భయభ్రాంతులకు గురైన వారు ఇండ్లు వదిలి సమీప బంధువుల ఇండ్లల్లో తలదాచుకున్నారు.

నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించాలి

- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-పోతంగల్/కోటగిరి


పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అకాలవర్షం, వడగండ్లకు నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని టాక్లీ, సోంపూరు, యాద్గార్‌పూర్ గ్రామాలలో మూడు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గంలోని చందూరు, పోతంగల్, కోటగిరి మండలాల్లోని కొన్ని గ్రామాలలో అకాలవర్షం, వడగండ్ల వానతో నోటికొచ్చిన పంట దెబ్బతిన్నదన్నారు. రైతుల బాధ చూస్తుంటే ఒక రైతుగా తనకు చాలా బాధ కలుగుతుందన్నారు. సర్వే చేసి పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపాలని అధికారులకు సూచించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25,000 నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ జెడ్పీటీసీ సిరాజ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ఏజాస్‌ఖాన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్డును బాగుచేయరు


కొట్టుకుపోయిన రోడ్డును చూపుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లి నుంచి గాంధారి మండలం కరక్‌వాడి గ్రామాల మధ్య రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. రోడ్డు బాగుచేయించాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. శుక్రవారం భూంపల్లి గ్రామస్తును రోడ్డును పరిశీలించారు. రోడ్డు బాగా లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఈదులయ సాయిరెడ్డి, బండరాజనర్సు సతీష్ ఇరు గ్రామ ల రైతులు పాల్గొన్నారు.

వసతిగృహంలో కంటివైద్య పరీక్షలు


కంటిసంరక్షణపై సూచనలిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ వసతి గృహంలో శుక్రవారం 176 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించినట్లు నేత్ర వైద్యుడు క్రాంతికుమార్ తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సారంపల్లి లో గల గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాల వసతి గృహంలో నేత్ర వైద్య సహాయకుడు హరికృష్ణ ఆధ్వర్యంలో ఈ నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. ముగ్గురు విద్యార్థులను శాస్త్ర చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని సరోజని దేవి నేత్ర వైద్యశాలకు సిఫార చేసినట్లు నేత్ర వైద్యుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలు ఎక్కువ
ప్రత్యేక అధికారులు తక్కువ

- కొందరికి ఐదారు గ్రామాల కేటాయింపు
- ఎవరు ఎక్కడ ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి
- కుంటుపడుతున్న గ్రామపాలన

నవతెలంగాణ-మద్నూర్

జీపీలకు సరిపడా ప్రత్యేకాధికారులను కేటాయించక పోవడంతో.. ఎవరు ఎక్కడ ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. ఒక్కో అధికారికి ఐదారు గ్రామాలు, కొందరికి రెండు నుంచి మూడు గ్రామాలు కేటాయించడంతో తమ విధులకు న్యాయం చేయలేకపోతున్నారు.

మద్నూర్ ఉమ్మడి మండలంలోని మద్నూర్, డొంగ్లి, మండలాల పరిధిలో మొత్తం 34 గ్రామపంచాయతీలు ఉన్నాయి. సర్పంచుల పదవీకాలం ముగియగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన తీసుకొచ్చిన విషయం విధితమే. 34 గ్రామపంచాయతీలకు గాను పదిమంది మాత్రమే ప్రత్యేక అధికారులు పాలన కొనసాగిస్తున్నారు. వీటిలో మద్నూర్ మండల అభివృద్ధి అధికారిని పరుచూరి రాణికి ఆరు గ్రామపంచాయతీలు, అలాగే మండల పంచాయతీ అధికారి వెంకట నరసయ్యకు ఆరు గ్రామపంచాయతీలు, మరో ఆరుగురి అధికారులకు మూడు గ్రామపంచాయతీలు, మరో ఇద్దరి అధికారులకు రెండు గ్రామపంచాయతీలను ప్రత్యేక అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం విధులు అప్పగించింది.



దీంతో అధికారులు విధులు నిర్వర్తించడంలో ఏ ఊరికి ఎప్పుడు వెళ్లాలి అనేది సందిగ్ధంగా కనిపిస్తోంది. వారంలో ఆరు రోజులు రోజుకు ఒక్క ఊరుకు వెళ్లిన వారం గడిచిపోతుంది. మళ్లీ వారం వరకు ఆ పంచాయతీకి వెళ్లాలంటే సమయం లేని పరిస్థితి, మూడు గ్రామాలు ఉన్న అధికారులకు రెండు రోజులకు ఒకసారి వెళ్లవలసిన పరిస్థితి, ఇక రెండు గ్రామాలు ఉన్న అధికారులకు మూడు రోజులకు ఒకసారి వెళ్లాల్సిన పరిస్థితి.

ఒక్కొ క్కరికి మూటగట్టినట్టు గ్రామపంచాయతీలు అప్పగిస్తే ఆ అధికారి ఏ రోజు ఏ ఊరికి వెళ్ళాలో తెలియని పరిస్థితి నెలకొంది. అసలే వేసవికాలం తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక దృష్టి పెట్టవలసిన అవసరం ఉంది. ఒక్కొక్క అధికారి ఆరు గ్రామపంచాయతీలు పాలన కొనసాగించాలంటే గ్రామాలను సందర్శించవలసిన అవసరం ఎంతైనా ఉంటుంది. ఎన్నికల్లో అధికారులు ఒకపక్క బిజీబిజీగా ఉండడం మరోపక్క అధికారులకు ప్రత్యేక అధికారులుగా నియమించడం అధికారులకు ఇబ్బందిక రంగానే విధుల నిర్వహణ కనిపిస్తోంది. గ్రామాల్లో ప్రజా సమస్యలు ఏర్పడకుండా ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి సాధించవలసిన అవసరం ఎంతైనా ఉందని ఉమ్మడి మండల ప్రజల్లో ఆవేదన వ్యక్తం అవుతుంది.

అధైర్యపడకండి.. అండగా ఉంటా

- అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం చేసిన మాజీ ఎమ్మెల్యే


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలం కొండాపూర్ తండాలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఐదు నివాసపు గుడిసెలు దగ్ధమైన విషయం విధితమే. కాగా బాధిత కుటుంబాలను శుక్రవారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శించారు. దగ్ధమైన నివాస గుడిసెలను పరిశీలించారు. మంజా గులాబ్ సింగ్, మంజా పర్తాల్ మంజా బద్య మరో ఇద్దరి ల గుడిసెలను పరిశీలించి ఆ కుటుంబాలను పరామర్శించిన అనంతరం బాధిత కుటుంబాలకు తక్షణ సాయం కింద నగద, బియ్యం, వంట సరుకులు అందించారు. అధైర్య పడకండి.. అండగా ఉంటామని భరోసా కల్పించారు. అగ్ని ప్రమాదంలో భారీగా ఆర్థిక నష్టం వాటిల్లడంతో ఆయన వారికి ధైర్యం చెప్పారు. అగ్ని ప్రమాదం సంభవించడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, మాజీ ఎంపీపీ సాయిలు, ఎంపీటీసీ గన్య నాయక్, రాజశేఖర్ రెడ్డి, శ్రీకాంత్, నర్సింలు, ఎంపీటీసీలు సర్వన్, సురేందర్, సర్పంచ్ సత్యం, మహిపాల్ రెడ్డి, మనోహర్ తదితరులు ఉన్నారు.

కాకతీయ కాలువకు సాగునీటి విడుదల


కాకతీయ కాలువ నుంచి దిగువకు ప్రవహిస్తున్న నీరు

నవతెలంగాణ-మెండోరా

పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుండి కాకతీయ కాలువ ద్వార ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సాగునీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజక్టులో నీరు లేకపోవడంతో సాగునీరు నిలిపివేయగా పంటలు కోత సమయంలో పంటపొలాలు ఎండిపోయే అవకాశం ఉన్నందునఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వారం రోజుల పాటు పంటపొలాలకు సాగునీటిని అందిస్తున్నామని ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాస్ తెలిపారు. ఇది చివరి తడి కావడంతో రైతులు నీటిని వధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మిగిలిన నీటిని చెరువులలో నింపుకోవాలని కోరారు.

ప్రాజక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.313 టిఎంసిలు) కాగా ప్రస్తుతం ప్రాజక్టు లో 1058.90 అడుగుల (12.43 టిఎంసిల) నీరు నిలకడగా ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

అక్రమ వడ్డీ వ్యాపారం నేరం

- జిల్లా ఎస్పీ సింధు శర్మ
- అక్రమ మార్గాల ద్వారా, అధిక వడ్డీల ద్వారా అమాయక ప్రజల నుండి డబ్బులు వసూలు చేస్తున్న వారిపై కేసులు నమోదు
- జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల తనిఖీలు



కామారెడ్డిలో ఫైనాన్సర్ల ఇండ్లల్లో, దుకాణాల్లో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కామారెడ్డి/భిక్కనూర్/గాంధారి

జిల్లాలో ఎవరైనా అక్రమంగా వడ్డీ వ్యాపారం చేస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ సింధు శర్మ హెచ్చరించారు. జిల్లాలో అక్రమ వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి కేంద్రాలపై పోలీసుల శుక్రవారం దాడులు ముమ్మర తనిఖీలు చేసి విలువైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శు క్రవారం వడ్డీ వ్యాపారుల కార్యాలయాల పై దాడులు చేసినట్టు తెలిపారు.

'జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు, మోసపూరిత మాటల ద్వారా, మరికొందరు వ్యాపారులు అమాయక ప్రజలను చూసి ఆర్థిక సహాయం చేస్తామని తెలుపుతూ వారి వద్ద నుండి ఇల్లు, ప్లాటు వ్యవసాయ భూముల దస్తావేజులను తీసుకొని అప్పులు ఇస్తున్నారు. తిరిగి డబ్బులు చెల్లించాలని అధిక వడ్డీ రేట్ల లెక్కలు చూపుతూ చెల్లించలేని పరిస్థితులను తీసుకువస్తూ వారి ఆస్తుల దస్తావేజులను జప్తు చేసుకుంటున్నారు. ఇలా వ్యాపారం చేస్తున్నారు అని అనుమానం, సమాచారం ఉన్న వ్యాపారులందరిపై జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో దాడులు చేస్తున్నాం. తనిఖీలలో పట్టుబడ్డ ఆధారాలను పరిగణలోకి తీసుకొని ఇలాంటి అక్రమ వ్యాపారాలు చేస్తున్న వారిపై కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 70 రైడ్స్ చేశాము. అందులో 23 కేసులు నమోదు చేశాము. దీనిలో భాగంగా 49 లక్షల 58000 వేల రూపాయలు, 157 గ్రాముల బంగారం, 315 ప్రాసరి నోట్లు, 63 ల్యాండ్ డాక్యుమెంట్స్ 24 అగ్రికల్చర్ ల్యాండ్ డాక్యుమెంట్లు, 25 చెక్స, పట్టా పాస్ బుక్కులు, ఖాళీ ప్రామిసరీ నోట్స్, నోట్స్ బుక్స్‌ను, ఇతర డాక్యుమెంట్స్‌ను స్వాధీనం చేసుకున్నాము. వ్యాపారులు చేస్తున్న ఆర్థిక మోసాలను తట్టుకోలేక ఎంతోమంది బాధితులు కుటుంబ సమేతంగా ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇలాంటి ఆత్మహత్యలను నివారించాలనే ఉద్దేశంతోనే అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మోసపూరిత వ్యాపారులపై దాడులు చేసినట్టు' ఎస్పీ సింధుశర్మ తెలిపారు.


భిక్కనూర్‌లో సోదాలు

కావున చట్ట వ్యతిరేక చర్యలు పాలు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సిహెచ్ సింధు శర్మ ఐపీఎస్ తెలిపారు.

ఫైనాన్స్‌లపై దాడి కేసు నమోదు

భిక్కనూర్ : భిక్కనూరు పట్టణంలో అనుమతులు లేకుండా జీరో ఫైనాన్స్ దందా నడుపుతున్న వారిపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. పట్టణ కేంద్రంలో ఉన్న వెంకటేశం, రాజేశం ఇద్దరి వద్ద ప్రామిసరీ నోట్లు సీజ్ చేసి వారి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు. అనుమతులు లేకుండా జీరో ఫైనాన్స్ దందా నడిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడులలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

జామే మసీద్ కమిటీ అధ్యక్షులుగా అహ్మద్ హుస్సేన్



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జామే మసీద్ కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా అహ్మద్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా అజారోద్దీన్, కోశాధికారిగా అజ్మత్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా అల్లావుద్దీన్, సలహాదారులుగా ఎంఏ అలీం, గాంధీనగర్ పాషాలను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ముస్లింల అభివద్ధికి తమ వంతుగా కషి చేస్తామని ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మసీదు కమిటీ సభ్యులు తెలిపారు. నూతన కమిటీ సభ్యులను సహచర సభ్యులు అభినందించారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-భిక్కనూర్

జాతీయ రహదారిపై వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన ఆటో ప్యాసింజర్‌లను ఎక్కించుకొని కామారెడ్డి నుంచి మెదక్ జిల్లా రామయంపేటకు వెళ్ళి తిరిగి కామారెడ్డి వస్తుండగా భిక్కనూరు బైపాస్ సమీపంలో ముందుగా వెళుతున్న లారీ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో దాన్ని తప్పించేందుకు ప్రయత్నించగా ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రాజు, అతని స్నేహితుడు అవినాష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే 108 అంబులెన్స్ లో కామారెడ్డి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-సదాశివనగర్

నవభారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు బంటు భూమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పార్టీలకతీతంగా నాయకులు, అధికారులు, జిల్లా ప్రజలందరూ వేడుకగా చేపట్టాలని కోరారు.

సహచట్టం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కామారెడ్డి

సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం అలై బలై కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలోని సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ పట్టణ కార్యాలయంలో రంజాన్ పండుగ ను పురస్కరించుకొని ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఏం రాజన్న, రాష్ట్ర డైరెక్టర్ ఎం ఏ సలీం పాల్గొని ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరినొకరు అలైబలై చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ఈ అలయ్‌బలయ్ కార్యక్రమంలో జోనల్ అధ్యక్షులు సిర్నాపల్లి ప్రదీప్ కుమార్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు శివపూజ లింబయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు, మహిళ కార్యదర్శి, దొమ్మేటి లలిత, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వి భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ అలీముద్దీన్ని, ప్రతినిధులు సుదర్శన్,అన్వర్ గౌరీ, డైరీ లింగం, మొహమ్మద్ లతీఫ్, రాజేశ్వర్, రాజు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మత్తడి పోచమ్మ రథోత్సవం

నవతెలంగాణ-లింగంపేట్


రథయాత్ర ఊరేగింపు

లింగంపేట్ మండల సమీపంలోని పెద్దవాగు సమీపంలో గల మత్తడి పోచమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉగాది పర్వదినం నుంచి ప్రారంభమైన మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారం ఉదయం రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించుకున్నారు. వేలాది మంది భక్తులు రథోత్సవ కార్యక్రమాన్ని ఆసక్తితో తిలకించారు. మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాలకు ఇతర జిల్లాలతో పాటు ఇతర మండలాలకు చెందిన వారు తరలివచ్చారు. ఒడి బియ్యం, నైవేద్యం టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

అనంతరం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. టెంకాయ కుస్తీ నుండి మొదలుకొని వెండి కడియాల వరకు కుస్తీ పోటీలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వెండి కడియాలను ఆలయ కమిటీ నిర్వాహకులు అందజేశారు.

జూన్ 30 వరకు ఓటిఎస్ స్కీమ్ పొడిగింపు

- ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్డిసిసిబిలో ఓటిఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం) ను పొడిగించినట్లు ఎన్‌డిసిసిబి చైర్మన్ కుంటా రమేష్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లా సహకార సంఘం బ్యాంక్ పాలకవర్గ సమావేశం శు క్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఓటిఎస్ పథకం ను ఏప్రిల్ 01 నుండి జూన్ 30 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ పాలకవర్గ సమావేశంలో ఓటిఎస్ నిర్ణయం తీసుకునట్లు వెల్లడించారు. తదుపరి ఓటిఎస్ స్కీమ్ పొడగింపు ఉండదని రైతులు గ్రహించి, ఈ ఓటిఎస్ స్కీమ్ ను సద్వినియోగం చేసుకొగలరని తెలిపారు. తదుపరి ఉమ్మడి జిల్లా సహకార సంఘాల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించినారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శులు, అధ్యక్షుల వారితో పాటు బ్యాంకు పాలకవర్గ సభ్యులను సన్మానించారు.


మాట్లాడుతున్న కుంట రమేశ్‌రెడ్డి

సహకార సంఘ కార్యదర్శులకు రూ.2 లక్షల ఆరోగ్య భీమా, సంఘ సిబ్బందికి గుర్తింపు కార్డుల కొరకు విన్నవించగా, అధ్యక్షుల, కార్యదర్శులకు ఆరోగ్య భీమా కల్పించి, సంఘ సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లా లో స్వల్పకాలిక వ్యవసాయ ఋణాలు 100 శాతం వసూళ్ళు అయ్యాయని తెలిపారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన సంఘం సిబ్బంది కి జీతబత్యాల కొరకు రాష్ట్ర ప్రభుత్వం నుండి 100 శాతం రియంబర్సమేంట్ కల్పించే విధముగా కషి చేస్తానని అన్నారు. ఈ సమావేశం లో పాలకవర్గ సభ్యులతో పాటు బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహక అధికారి నాగభుషణం వందే, ఉన్నత అధికారులు, సంఘ కార్యదర్శులు పాల్గొన్నారు.

అల్ఫోజోలం పట్టివేత

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని పెద్దదేవాడ గ్రామానికి చెందిన సతీష్‌గౌడ్ నిర్వహిస్తున్న కళ్ళు కాంపౌండ్‌లో కళ్ళు తయారు చేయడానికి హానికరమైన పదార్థాలు ఉపయోగిస్తున్నాడని పక్క సమాచారం మేరకు రైడింగ్ చేయగా అందులో నిషేధింపబడిన ఆల్ఫోజోలం పట్టుకున్నా మని ఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. అట్టి ఆల్ఫాజోలం సుమారుగా 240 గ్రాములు మిక్సిడ్ పౌడర్‌గా పట్టుబడినట్టు తెలిపారు. కల్తీ కళ్ళు తయారు చేయడం వల్ల ప్రజల ఆరోగ్యానికి హానికరం అని తెలిసి కూడా తయారు చేస్తున్నందున సతీష్ గౌడ్ పైన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విగ్రహప్రతిష్టాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్


వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

మద్నూర్ మండల కేంద్రంలోని ముత్యాల పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హన్మంతు షిండే శుక్రవారం పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు ముత్యాల పోచమ్మ గల్లి ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పేపర్ బాయ్‌కు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-భిక్కనూర్

నియంత్రణ లేని వేగంతో వచ్చిన కారు ఢీకొనడంతో పేపర్ బాయ్‌కు గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని బస్వాపూర్‌లో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామ శివారులో గ్రామానికి చెందిన బాల గౌడ్ గ్రామంలో పేపర్ బాయ్ గా పని చేస్తాడు. ఉదయం గ్రామ సమీపంలోని హెూటల్లో పేపర్ వేయడానికి హైవే రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో బాలా గౌడ్ కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి గాయాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం గ్రామస్తులు అదే వాహనంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరి మృతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి


మృతిచెందిన శేఖర్

చేపలు పట్టడానికి వెళ్లి ఒకరు మృతి చెందారు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన పూసవేర్ల శేఖర్ (32) కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తు న్నాడు. గురువారం మధ్యాహ్నం 12:30 గంటలకు చేపలు పట్టడానికి కలిగోట్ గ్రామంలోని కుమ్మరి కుంటకు వెళ్లి చెరువులో వలకు ప్రమాదవశాత్తు తట్టుకొని మునిగిపోయి చనిపోయాడు. శుక్రవారం ఉదయం 11:30 గంటలకు శవాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఏర్గట్ల


మృతిచెందిన ప్రీత్‌సింగ్

పంజాబ్ రాష్ట్రానికి చెందిన లవ్ ప్రీత్ సింగ్ ప్రమాదవశాత్తు అనుకోకుండా గుమ్మిర్యాల్ గోదావరి నదిలో పడి మరణించారు. ఏర్గట్ల ఎస్సై మచ్చేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పంజాబ్ రాష్ట్రానికి చెందిన లవ్ ప్రీత్ సింగ్ (19) హార్వెస్టర్ సహాయకుడిగా పనిచేస్తున్నాడు. అనుకోకుండా గుమ్మిర్యాల్ గోదావరి నదిలో పడి మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శిథిలావస్థకు నీలా రెవెన్యూ కార్యాలయం

నవతెలంగాణ-రెంజల్

మండలం నీలా గ్రామంలోని రెవెన్యూ కార్యాలయం గత కొన్ని రోజులుగా నిరుపయోగంగా మారడంతో అది ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయం ఆవరణలో రైతులు తమ ట్రాక్టర్ సామాన్లను భద్రపరచుకున్నారు. గతంలో రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐతో పాటు వీఆర్వోలు స్థానికంగా ఉంటూ రైతుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేవారు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయంలో వారు తమ విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాలు కబ్జాకు గురి కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థలో కార్యాలయం

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని చిన్నాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇంఛార్జి పి.వినయ్ కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు ఐదులై గంగారెడ్డి, యూత్ అధ్యక్షులు ఇదులై సుమన్, యూత్ ఉపాధ్యక్షులు అర్గుల సంతోష్, బిజెపి కార్యకర్త కొలుకుల సాయికుమార్ తదితరులు కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, కేంద్రంలో అధికారం కోసం పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, సింగిల్ విండో డైరెక్టర్ కాశీనాథ్ రావు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

రిటైర్మెంట్ వయసుపై వస్తున్న వార్తలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

- టీఎస్ యూటీఎఫ్

నవతెలంగాణ-భీంగల్

ఉద్యోగుల వయసు 61 సంవత్సరాలు లేదా 33 సంవత్సరాల సర్వీసు పూర్తైతే రిటైర్మెంట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లుగా కొన్ని పత్రికలు, టీవీ ఛానల్స్‌లో వైరల్ అవుతున్న వార్తపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని టిఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్కా జనార్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంపై వార్త 61పై సాధారణ పరిపాలనా శాఖ, ఆర్థిక శాఖ అధికారులను సంప్రదించగా తమకు తెలియదని అంటున్నారని, పార్లమెంట్ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో ఉన్న సందర్భంలో విధాన పరమైన నిర్ణయాలు తీసుకునే అధికారం మంత్రివర్గానికి గానీ అధికారులకు గానీ లేదని చెప్తున్నారని పేర్కొన్నారు. ఇటువంటి గాలి వార్తలను ప్రచారంలో పెట్టి ఉద్యోగులను గందరగోళంలోకి నెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఆలోచనతో ఎవరైనా చేస్తున్నారేమో అనే సందేహం కలుగుతుందని తెలిపారు. నిజంగానే అటువంటి ఆలోచన ప్రభుత్వానికి ఉంటే దానిని టిఎస్ యూటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, సర్వీసును 33 సంవత్సరాలకు పరిమితం చేయటం సమంజసం కాదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై వివరణ ఇవ్వాలని మల్క జనార్ధన్ ప్రభుత్వాన్ని కోరారు.

నూతన సర్వ సమాజ్ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నూతన సర్వసమాజ్ (గ్రామ అభివృద్ధి కమిటీ) సభ్యులుగా ఆకుల లక్ష్మణ్, భూమేని రవి, సంబరి శ్రీనివాస్, సాజిద్, సిరిపురం రాజన్నను గ్రామస్తులు అన్ని కులసంఘాల సభ్యులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మామిడిపల్లి హనుమాన్ మందిర ఆవరణలో గ్రామస్తులు సమావేశమయ్యారు. గత సంవత్సరం పెద్ద మనుషులు ఆదాయ వ్యయాలు చదివి వినిపించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు గ్రామాభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను కౌన్సిలర్లు ఆకుల రాము, రవిగౌడ్, కాశీరాంలు అభినందించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో వివిధ కుల సంఘాల ప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించకుంటే రోడ్డెక్కుతాం

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని

అకాల వర్షం.. వడగండ్లకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించకుంటే రోడ్డెక్కుతామని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని జాలాల్‌పూర్, చందూర్, మోస్రా మండలాల్లోని పలు గ్రామాల్లో పంట నష్టపోయిన రైతులతో కలిసి మాట్లాడారు. ఉమ్మడి మండలంలో సుమారు 600ల ఎకరాలకుపైగా రైతులు పంటను నష్టపోయారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో అకాల వర్షాలు పడి రైతులు నష్టపోతే వారి గురించి ప్రభుత్వం ఎందుకు నోరు విప్పడం లేదని ఆయన ప్రశ్నించారు. రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించి వారి కుటుంబాలకు అండగా ఉండాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రతిపక్షంగా బీఆర్ఎస్ నాయకులు రోడ్లపై, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు కలాల్ గిరి, గోపాల్, రంజ నాయక్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కృష్ణవేణి హైస్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

- పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎం.నరేందర్



నవతెలంగాణ-భీంగల్

నిబంధనలు పాటించని కృష్ణవేణి హైస్కూల్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు నరేందర్ విద్యాశాఖను డిమాండ్ చేశారు. భీంగల్ పట్టణ కేంద్రంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ మండల కార్యదర్శి రాజేశ్వర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేటిఎస్ పాఠశాల ప్రభుత్వ నిబంధనలు పెడచెవిన పెడుతూ విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తుందని వారు తెలిపారు. ఒక వైపు విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కి కేవలం ఫీజులు దోపిడీ చేసే విధంగా ఉందని వారు అన్నారు. ఏప్రిల్ 8న జరిగిన బస్సు ప్రమాదం ఘటనపై నేటి వరకు విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటని వారు అన్నారు. ఈ స్కూలుకు చెందిన బస్సు అనేకమార్లు ప్రమాదానికి గురైనా నేటి వరకు విద్యాశాఖ నుంచి ఏమాత్రం చర్యలు కనిపించకపోవడం శోచనీయమని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను పక్కకు పెట్టి విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులను వసూలు చేయడమే ధ్యేయంగా పనిచేస్తుందని వారు అన్నారు. తక్షణమే కృష్ణవేణి పాఠశాల గుర్తింపును రద్దుచేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో కృష్ణవేణి పాఠశాల గుర్తింపు రద్దు చేసే వరకు ఉద్యమాలు జరుగుతాయని అటు అధికారుల మీద కూడా ఉద్యమం కొనసాగుతుందని వారు హెచ్చరించారు. సమావేశంలో పిడిఎస్‌యు నాయకులు హరీష్, ప్రణయ్, భారత్, సాయిచరణ్, రాణప్రతాప్, వివేక్, కార్తీక్, వినయ్, చందు, శ్రీను, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

మంజీరాలో ఇసుక తవ్వకాలు

- అనుమతి లేకుండానే..
- ధర పెంచి.. ఇష్టానుసారంగా అమ్మకాలు

నవతెలంగాణ-బోధన్



ఖండ్‌గాం మంజీరా నదిలో జెసిబితో ఇసుక తవ్వకాలు



మంజీరా నది ఒడ్డున నిల్వ ఉంచిన ఇసుక కుప్పలు

బోధన్ మండలంలోని ఖండ్‌గాం గ్రామ సమీపంలో గల మంజీరా నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. శుక్రవారం కొంతమంది రెండు జేసీబీలను వినియోగించి మంజీరా నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. భారీ టిప్పర్లలో ఇసుకను తరలిస్తూ నది ఒడ్డున డంపు చేస్తున్నారు. ప్రభుత్వం వారంలో రెండు రోజులు బుధ, గురువారం మాత్రమే ఇసుక తరలింపు అనుమతులిచ్చింది. కానీ శుక్రవారం ప్రభుత్వ సెలవు దినమైనా సైతం కొంతమంది గుట్టుచప్పుడు కాకుండా మంజీర నదిలో జేసీబీలతో ఇసుక తవ్వకాలు చేపడుతుండడం గమనార్హం. అలాగే టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ సమీపంలోని ఒడ్డున డంప్ చేస్తున్నారు. అధికారులు ఎన్నికల విధులలో నిమగ్నమవడం వలన ఇదే అదునుగా భావించిన కొంతమంది అక్రమార్కులు మంజీరా నదిలో జెసిబిలతో ఇసుకను తవ్వడం, డంప్ చేయడం చేశారు. ఖండ్‌గాం ఎత్తిపోతల వద్ద పెద్ద పెద్ద ఇసుక కుప్పలు నిల్వ చేశారు.

ఇష్టమున్న ధరలో అమ్మకాలు..

అధికారుల కండ్లు గప్పి ఇసుకను అక్రమంగా తోడుతున్న కొంతమంది ఇష్టరీతినా ధరలు పెంచి అమ్ముతున్నారు. ఒక ఇసుక టిప్పర్ రూ.20 వేల నుంచి రూ.25000 రూపాయలకు అమ్ముకుంటున్నారు. గతంలో ట్రాక్టర్ ఇసుక 1000 నుంచి 1500కు అమ్మిన వారు నేడు 3500 నుంచి 5000 ధర పెంచి విక్రయిస్తున్నారు. శుక్రవారం నవతెలంగాణ పరిశీలనలో ఖండ్‌గాం మంజీరా నది సమీపంలోని రహస్య ప్రాంతాల్లో ఇసుక కుప్పల నిల్వలు వెలుగు చూశాయి.

అలాగే కొంతమంది వ్యక్తులు మంజీరా నదిలోని ఇసుకను సమీపంలో డంప్ చేస్తూ ఉన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలపై పోలీసులు దాడులు చేసి పట్టుకున్న అక్రమార్కులు వారి దందాలు మాత్రం మానడం లేదు. రెవెన్యూ శాఖ అధికారులు ఎంత కఠినంగా వ్యవహరించినా ఇసుకాసురుల తీరు మారడం లేదు. మంజీరా నదిలో ఇసుక అక్రమంగా తరలించడం వలన భూగర్భ జలాలు పడిపోయి బోరుబావులు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా అక్రమ ఇసుక రవాణాకు అలవాటు పడిన అక్రమార్కులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వలేదు

శుక్రవారం ప్రభుత్వ సెలవుదినం కావడంతో ఇసుక తరలింపు ఎవరికి అనుమతి ఇవ్వలేదు. ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

- తహసీల్దార్ గంగాధర్

మతోన్మాదాన్ని ఎదిరించి.. రాజ్యాంగాన్ని రక్షించాలి

- 18న జరిగే జిల్లా సదస్సును విజయవంతం చేయండి
- వామపక్ష నాయకుల పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న ఎ.రమేష్‌బాబు

మతోన్మాదాన్ని ఎదిరించి రాజ్యాంగాన్ని రక్షించాలని 18న జరిగే సదస్సును విజయవంతం చేయాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఐ(ఎం) కార్యాలయంలో జిల్లాలోని వామపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్‌బాబు మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించవలసిన అవసరం ఎంతైనా ఉందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే పద్ధతుల్లో బిజెపి కేంద్ర ప్రభుత్వం సిబిఐ, ఈడి, ఇన్కమ్ టాక్స్ తదితర సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాల గొంతునొక్కటంతో పాటు, ప్రజల్లో మత విద్వేషాలను రగిలిస్తుందన్నారు. తిరిగి మూడోసారి అధికారంలోకి తామే వస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిజెపికి 370 పైగా స్థానాలు సాధించటంతో పాటు ఎన్డీఏకు 400పైన స్థానాలు వస్తాయని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే పద్ధతుల్లో మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. అందువల్ల ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడంతో పాటు మతోన్మాద శక్తులను నిలువరించాలని అందుకొరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 18న ప్రెస్‌క్లబ్‌లో జిల్లా సదస్సును నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ సదస్సు ద్వారా మతోన్మాద ప్రమాదాన్ని వామపక్ష పార్టీల కార్యకర్తలతో పాటు ప్రజల్లో చైతన్యం తీసుకు రావడానికి ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. 18న ఉదయం 11 గంటలకు జరిగే జిల్లా సదస్సులో వామపక్ష పార్టీల కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, న్యూ డెమోక్రసీ నాయకులు శివకుమార్, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, న్యూ డెమోక్రసీ నాయకులు గంగాధర్, రాజేశ్వర్, సిపిఐ నాయకులు ఓమయ్య, తదితరులు పాల్గొన్నారు.

మధురం.. చెరుకు రసం

- ఐస్ లేకుండానే
- కొత్త యంత్రాలతో తయారీ
- అన్ని కాలాల్లో అందుబాటులో..



చెరుకు రసం తయారీ చేస్తున్న నిర్వాహకుడు

నవతెలంగాణ-కంఠేశ్వర్

చెరుకు రసం పేరు వినగానే నోరూరుతుంది. దానిని తాగితే ఆరోగ్యానికి మంచిది. దీంతో చెరుకు రసం తాగడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కొత్త పద్ధతిలో చెరుకు రసాన్ని తయారు చేస్తూ నగరంలో కొందరు ఉపాధి పొందుతున్నారు. గతంలో చేరుకు రసం తీసేందుకు చెరుకు గడలను గానుగ పట్టేవారు. తర్వాత గిరకలు వచ్చాయి. చెరుకు రసం చల్లగా ఉండేందుకు దానిలో ఐస్ వాడేవారు. ఐస్‌లో నాణ్యత లేకపోవడంతో ప్రజలు దానిని తాగడానికి ఇష్టపడేవారు కాదు. ప్రస్తుతం ఐస్ లేకుండానే చల్లని చేరుకు రసం తీసే మిషన్లు వచ్చాయి. దీనిలో మొదట చెరుకు గడలను శుభ్రం చేసి, ఫ్రిడ్జ్‌లో పెడతారు. చల్లగా అయిన గడలను మిషన్‌లో పెడితే చల్లటి చెరుకు రసం వస్తుంది. ఇందులో కల్తీ లేకపోవడంతో రుచిగా ఉండడంతో చెరుకు రసాన్ని తాగేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు చెరుకు రసం వేసవిలోనే లభ్యమయ్యేది. ఇప్పుడు చెరుకు రసానికి డిమాండ్ పెరగడంతో, అన్ని కాలాల్లోనూ అందుబాటులో ఉంటుంది. చెరుకు రసం రుచిగా ఉండడంతో పోషక విలువలు కలిగి ఉండడంతో ప్రజలు తాగడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. చెరుకు రసాన్ని వివిధ ఫ్లేవర్లలో కూడా తయారు చేస్తున్నారు. లెమన్, జింజర్, మిర్యాల పొడి, మసాలాతో రసం తయారు చేస్తూ ప్రజల్ని ఆకట్టుకుంటున్నారు.

మహారాష్ట్ర నుంచి దిగుమతి చెరుకు గడలను మహారాష్ట్రలోని నాసిక్, షిరిడి నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. వేసవిలో నాసిక్ నుంచి చలికాలంలో షిరిడీ నుంచి చెరుకు తెప్పిస్తున్నారు. మహారాష్ట్రలో పండే చెరుకు బాగుండడం గడలు రుచిగా ఉండడంతో వ్యాపారులు అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

నాణ్యమైన చెరుకు రసం..

ఆరోగ్యం కోసం నాణ్యమైన చెరుకు రసం ప్రజలకు అందించడానికి ప్రయత్నిస్తున్నామని నిర్వాహకులు మేకల భూమేష్ తెలిపారు. నగరంలోని కంఠేశ్వర్ వద్ద చెరుకు రసం నిత్యం తయారు చేస్తున్నామని తెలిపారు. రూ.20కి గ్లాస్, లీటర్ రూ.80 విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఐసు లేకపోవడంతో ప్రజలు చెరుకు రసం తాగడానికి ఆసక్తి చూపుతున్నారని ఆయన తెలిపారు.



చెరుకు రసం గ్లాసులో పోస్తున్న వ్యాపారి

ధాన్యం కేంద్రాలున్నా.. దళారులకే విక్రయం

- తరుగు తీయకుండా తీసుకోవడంతో ప్రయివేటుకే ఆసక్తి

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలంలోని రైతులు ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ.. దళారులకే తమ ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. దళారులు తరుగు తీయకుండా.. తేమశాతం చూడకుండా క్వింటాకు రూ.2200 చెల్లించడంతో వారికే విక్రయిస్తున్నారు.

మండలంలో ఇప్పటికే వేలాది బస్తాల ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారస్తులు కొనుగోలు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో 17శాతం లోపు తేమతో కూడి ఉండడమే కాకుండా, హమాలీలకు బస్తాకు రూ.16 చొప్పున క్వింటాకు రూ.36 రూపాయలు ఇవ్వవలసి రావడంతో రైతులు ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు ఎండబెట్టిన ధాన్యాన్ని రూ.2200 ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారస్తులను ఆశ్రయిస్తున్నారు. దీంతోపాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో క్వింటాకు రెండు కిలోల చొప్పున తాలురూపంలో తరుగు తీయడంతో రైతులు నష్టపోతున్నామని, అందుకే ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యం విక్రయిస్తే హ మాలీల డబ్బులతోపాటు, రెండు కిలోల తరుగు ఉండదని వారు భావిస్తున్నారు.

మండలంలో మూడు సొసైటీల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా, ఐకెపి ద్వారా మరో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు.



ధాన్యాన్ని తూకం వేస్తున్న కూలీలు

పశువుల రక్షణకు జాగ్రత్తలు చేపట్టాలి

- జిల్లా వైద్యాధికారి జగన్నాథచారి

నవతెలంగాణ-మాక్లూర్

వేసవి కాలంలో పశువుల సంరక్షణకు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి జగన్నాథచారి సూచించారు. శుక్రవారం మండలంలోని గుంజిలి గ్రామంలో పశు వైద్యశాల, పశు సంవర్ధక శాఖ అధ్వర్యంలో పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా 344 పశువులకు టీకాలను వేశారు. ప్రతి రైతు తమ పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని, ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వేసవిలో పశువులకు నీడలను ఏర్పాటు చేయాలని, ఎండవల్ల పాల దిగుబడి తగ్గుతుందని తెలిపారు. ఉదయం సాయంత్రం మాత్రమే పశువులను మేపడానికి తీసుకువెళ్లాలని, ఇంటివద్దనే నీరు తాగించడం మంచిదన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు కిరణ్ దేశ్ పాండే, ఉమమ సహెర్, విఎల్ఓ వినిత, విఏ అహ్మద్ పాషా, గోపాలమిత్ర సుధీర్, వ్యాక్సినేటర్ జైలొసింగ్, సిబ్బంది శ్రీను, గంగాధర్, పుష్ప, లక్ష్మి రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి

బడా రామ్ మందిర్‌లో పూజలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని బ్రహ్మపురి వద్ద గల బడారాం మందిర్‌లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మఠం ఫిట్ పర్సన్ గింజుపల్లి వేణు, ఆలయ సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్ కుమార్, అటెండర్ నాగరాజు, ఇందూర్ బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బాల్కొండ విద్యుత్ శాఖ ఏఈ కే శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.